సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి

విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రొనాల్డ్‌రాస్‌తో సమావేశమైన తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్‌కుమార్ గౌడ్

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఈ విషయమై రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రొనాల్డ్ రాస్‌ను కలిశామని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఖైరతాబాద్‌లోని టీజీ ట్రాన్స్‌కో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకానికి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ పథకాన్ని అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో లక్షలాది విద్యుత్ వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ యూనిట్ల ఏర్పాటు కాంట్రాక్టర్లు వీటిని ఏర్పాటుకు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిని పెంచేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం సైతం ఈ పథకానికి మద్దతుగా నిలిస్తే తెలంగాణలో లక్షలాది మంది తమ ఇళ్లపై సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తక్కువ పెట్టుబడితోనే విద్యుత్ సౌకర్యాన్ని పొందడంతో పాటు తిరిగి సోలార్ విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించే స్థాయికి వస్తాయని అశోక్‌కుమార్ తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో సోలార్ ఎనర్జీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీహరి బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజేశ్ పరకాల తదితరులు ఉన్నారు.

రేపు జాబ్ మేళా

సిటీబ్యూరో, జులై 22 (నమస్తే తెలంగాణ) : మల్లెపల్లిలోని ఉపాధి కార్యాలయంలో ఈనెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన అధికారి మైత్రీప్రియా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ అర్హత గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం 8328428933 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మేడ్చల్ కలెక్టరేట్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఉపాధి కల్పన అధికారి రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత www. nic.gov.in పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866465024 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బోనాలు విజయవంతం..

జంటనగరాల పరిధిలో జరిగిన బోనాల జాతర ఉత్సవాలు విజయవంతం కావడంతో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధానంగా పోలీస్ శాఖ, జీహెచ్ ఎంసీ, ఫైర్ అధికారులు, ట్రాఫిక్, విద్యుత్, జలమండలి తదితర శాఖల అధికారుల సహకారంతో బోనాల ఉత్సవాలు విజయవంతమయ్యాయన్నారు.

అమ్మవారిని అంబారీపై ఊరేగింపుగా తీసుకువస్తున్న నిర్వాహకులు

అంబారీపై అమ్మవారి ఊరేగింపు

భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత పూజల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

బేగంపేట్ జూలై 22: లష్కర్ బోనాల ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సాక సమర్పణ భవిష్యవాణి, బలిగంప, పోతరాజుల విన్యాసాలు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మహంకాళి అమ్మవారి ఊరేగింపులో కోలాటం, లంబాడి నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల వేషధారణలు, ఘటాల ఊరేగింపు కోలాహాలంగా సాగింది. అమ్మవారి అంబారీ ఊరేగింపు అనంతరం మెట్టుగూడలో దేవాలయానికి తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా వివిధ ప్రాంతాల్లో కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందే ఉదయం అమ్మవారి దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పాల్గొని మహంకాళి అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

సరిపడా వర్షాలు.. సమృద్ధిగా పంటలు

మహంకాళి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజల అనంతరం భవిష్యవాణి వినిపించారు. ఉదయం 11గంటలకు మాతంగి స్వర్ణలత ముఖం నిండా పసుపు పూసుకొని మాతంగేశ్వరి అమ్మవారి ఆలయం ఎదుట పచ్చికుండపై నిలబడి భవిష్యత్‌లో జరిగే పరిణామాలను ప్రజల యోగాక్షేమాలను వినిపించింది. భక్తులు నా రూపాన్ని పెట్టాలి అనుకుంటున్నారు కదా పెట్టండి ఎవరు ఏం చేసినా ఎవరు అడ్డుపడినా నా రూపం నేనే పెట్టుకుంటాను తప్పని సరిగా నా రూపాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పాడిపంటలు ఇదివరకు లాగా పండించడం లేదు ప్రజలంతా ఔషధాలు ఎక్కువగా వాడుతున్నారు. అందుకే అనారోగ్యం బారిన పడుతున్నారు. వాటిని తగ్గించుకుంటే వ్యాధులు తగ్గుతాయన్నారు.. నన్ను నమ్ముకున్న వారిని నా భక్తులను కాపాడుకుంటాను అని తెలిపారు.

ఈ సారి కూడా వర్షాలు సమృద్ధిగా పడుతాయి..మీరు మీరు సంతోషంగా ఆనందంగా ఉండండని అన్నారు. ఏ బోనమైనా ఎవరు ఎత్తుకు వచ్చిన పర్వాలేదు సంతోషంగా అందుకునేది నేనే వారు వీరు తేవాలని సందేహం పెట్టుకోకండి. ఈ యేడాది పూజలు సంతోషాన్ని ఇచ్చాయని భవిష్యవాణి వినిపించారు.

కుక్కల బెడద తొలగించారు

కదిలిన అధికార యంత్రాంగం

నమస్తే ఎఫెక్ట్

కుత్బుల్లాపూర్,జూలై22: 'కుక్కల నుంచి కాపాడండి ప్లీజ్' అని శీర్షికన నమస్తేతెలంగాణలో వచ్చిన కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట వీధికుక్కల బారిన పడిన బాధితులు, బాలలు చేపట్టిన నిరసన దీక్షకు అధికారులు స్పందించారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నార్త్ ఎన్‌సీఎల్ కాలనీతో పాటు ఆయా ప్రాంతాల్లో బ్లూక్రాస్ సొసైటీ నిర్వాహకులతో కలిసి వీధికుక్కలను పట్టుకెళ్లారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ వీధికుక్కల దాడిలో పలువురు గాయపడింది వాస్తవమేనన్నారు. ప్రజలకు కుక్కల నుంచి రక్షణ కల్పించేందుకు కొంపల్లి మున్సిపాలిటీ నుంచి బ్లూక్రాస్ సొసైటీ ద్వారా 2023 జనవరి 15 నుంచి శునకాల నివారణ, స్టెరిలైజేషన్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. నాటి నుంచి ఆయా కాలనీల్లో వివిధ కార్యక్రమాలు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్యాలెండర్‌ను రూపొందించి దాని ప్రాతిపదికన ముందుకెళ్తున్నామని, ఏబీసీ/ఏఆర్ కార్యక్రమాలు అమలు నివేదికలను స్థానిక యానిమల్ బర్త్ కంట్రోల్ మానిటరింగ్ కమిటీకి విధిగా సమర్పిస్తున్నట్లు తెలిపారు. కుక్కకాటుకు గురైన వారి పై మానవీయ పద్ధతుల్లో స్పందిస్తున్నామని, ఇప్పటి వరకు 12 కుక్కలను పట్టుకొని స్టెరిలైజ్ చేశామని పేర్కొన్నారు.

సీడీఎఫ్‌డీ సందర్శన

సిటీబ్యూరో, జూలై 22(నమస్తే తెలంగాణ) : ఏపీలోని సెరికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ లోని ఇంక్యుబేషన్ సెంటర్‌ను సోమవారం సందర్శించింది. లైఫ్ సైన్సెస్, పట్టు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా పరిశోధనలు చేయనున్నారు. ఇప్పటికే ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం కల్పించేలా సీడీఎఫ్‌డీ బృందంతో సెరికల్చర్ ప్రతినిధులు చర్చలు జరిపారు. అదేవిధంగా ఇరు సంస్థల మధ్య టెక్నాలజీ మార్పిడి అమలు చేయాలని భావిస్తున్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు రాష్ట్ర బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి నరేంద్రాచార్య తెలిపారు. సోమవారం అఖిల భారత బ్రాహ్మణ అర్చక సేవా సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్‌పాండేతో కలిసి సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌ను కలిసి బ్రాహ్మణులు పడుతున్న ఇబ్బందులపై వినతి పత్రం అందజేశారు.

– బాలానగర్, జూలై 22

పాపన్న జయంతిని సెలవుగా ప్రకటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 22: సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ డిమాండ్ చేశారు. పాపన్న మహారాజ్ 374వ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావుగౌడ్ మాట్లాడుతూ ఉత్సవాలను వచ్చే నెల 11న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ ఉద్యమం ఏపీ తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిశోర్‌గౌడ్, గుండ్రాతి నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ ముఠా ఫామ్‌హౌస్ కూల్చివేత

సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

17 మంది అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ)/ శంషాబాద్ రూరల్: భూకబ్జా, కిడ్నాప్‌లకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న దుండగులపై తెలంగాణ పోలీసులు తొలిసారి 'ఆపరేషన్ బుల్డోజర్'ను ప్రయోగించారు. భూకబ్జాలతో పాటు మారణాయుధాలతో బాధితులను బెదిరింపులకు గురిచేయడం, కిడ్నాప్‌నకు పాల్పడి ఫామ్‌హౌస్‌లలో బంధించటం వంటి ఘోరాలకు పాల్పడుతున్న ఒక ముఠాకు చెందిన 17 మందిని కటకటాల్లోకి నెట్టిన రాజేంద్రనగర్ జోన్ పోలీసులు.. శంషాబాద్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్న వారి ఫామ్‌హౌస్‌ను మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి నేలమట్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫక్రుద్దీన్, సుజాత్‌అలీ 20-30 మందితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు రాజేంద్రనగర్ మండలంతో పాటు దాని పరసర ప్రాంతాల్లో ఖరీదైన ఖాళీ స్థలాలను కబ్జా చేస్తారు. విదేశాల్లో ఉన్న ఓనర్లు, వృద్ధాప్యంలో ఉన్న ఓనర్లు, వెనకాముందు ఎవరూ లేని బలహీనులను లక్ష్యంగా చేసుకుని కబ్జాలకు పాల్పడుతుంటారు. ఇలాంటివారి ఖాళీ స్థలాలను కొనుగోలు చేసినట్టు నకిలీ పత్రాలు సృష్టిస్తారు. కొన్ని సందర్భాల్లో సర్వే నంబర్లను తారుమారు చేసి స్థలాలను కబ్జా చేస్తారు. ఇటీవల గండిపేటలో ఒక వైద్యుడి స్థలాన్ని కబ్జాచేసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఓ స్థలం వివాదంలో ఎమ్మార్పీఎస్ నేత నరేందర్‌ను కిడ్నాప్ చేసి, శంషాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో బంధించి, చిత్రహింసలకు గురిచేశారు. అత్తాపూర్‌లోని అక్బర్‌హిల్స్‌లో ఉన్న 500 గజాల స్థలాన్ని కబ్జాచేసి, ఆ స్థలంలోకి ఎవరూ రాకుండా మారణాయుధాలు, వేట కుక్కలతో తిష్టవేశారు. బాధితుల ఫిర్యాదుతో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్.. స్థానిక పోలీసులు, ఎస్‌వోటీ బృందాలను రంగంలోకి దించి ప్రధాన నిందితుడు సుజాత్ అలీని ఇటీవల ముంబైలో అరెస్టు చేశారు. అతడితో పాటు ఇప్పటి వరకు 17 మందిని కటకటాల్లోకి నెట్టారు. ఈ రౌడీమూక శంషాబాద్ ధర్మగిరి దేవాలయం దగ్గర, సర్వే నంబర్ 103/21లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఫామ్‌హౌస్ కేంద్రంగా కబ్జాలు, బలవంతపు సెటిల్‌మెంట్లు, కిడ్నాప్‌లు చేస్తున్నట్టు విచారణలో తేలటంతో.. సోమవారం ఆ ఫామ్‌హౌజ్‌ను బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. ఆ ఫామ్‌హౌజ్ నిర్మాణానికి అనుమతులు లేవని, స్థలం కూడా అక్షయ్ సత్‌సేనా అనే వ్యక్తికి చెందినదని.. దాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపట్టారని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. తమ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించారన్న బాధితుల ఫిర్యాదుతో శంషాబాద్ పోలీసుల సహకారంతో దాన్ని కూల్చివేశామని పేర్కొన్నారు.

గ్యాస్ గీజరే కారణం..

అమీర్‌పేట్, జూలై 22 : సనత్‌నగర్ జెక్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణానికి బాత్రూమ్‌లో గ్యాస్ సిలెండర్ ఆధారిత గీజర్ వాడకమే కారణమై ఉంటుందని వైద్యులు పాథమిక అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. మానసిక స్థితి సరిగా లేని తమ కుమారుడు హరికి తల్లిదండ్రులు వెంకటేశ్, మాధవి బాత్రూమ్‌లో స్నానం చేయిస్తున్న సమయంలో విషవాయువులు లీకై ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలుస్తోంది. అయితే కార్బన్ మోనాక్సైడ్ వాయువును సకాలంలో గుర్తించడం కూడా కష్టం. కొంత ఆలస్యమైనా మనిషిని నిస్సత్తువకు గురి చేసే ప్రమాదం ఉంటుంది. విషవాయువులు బయటకు వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితుల్లో బాత్రూమ్‌లోనే తల్లిదండ్రులు సహా కుమారుడు ఉక్కిరిబిక్కిరికి గురై మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే పోస్ట్ మార్టం అనంతరం వెంకటేశ్ మృతదేహాన్ని సిగ్నోడ్ కంపెనీలోని సహచరులు, బెంగుళూరు నుంచి వచ్చిన బంధువుల సమక్షంలో సోమవారం సాయంత్రం లాలాపేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్టు జెక్‌కాలనీ రెసిడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్ తెలిపారు.

బదిలీపై వెళుతున్న వైద్యులకు ప్రశంసాపత్రాలను అందజేసిన డా.రమేశ్‌రెడ్డి, డా.రాజారావు

గాంధీలో సేవలు సంతృప్తినిచ్చాయి

40 మంది వైద్యులు, సిబ్బంది బదిలీ

బన్సీలాల్‌పేట్, జూలై 22 : గాంధీ దవాఖాన నుంచి బదిలీ అయిన 40 మంది సీనియర్ వైద్యులు, ఆర్ఎంఓలు, డైటీషియన్, ఫార్మాసిస్టులు, పరిపాలన విభాగం సిబ్బందిని సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు మాట్లాడుతూ అంకితభావంతో వైద్య సేవలు అందించిన వైద్యులను ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, విధి నిర్వహణలో చిత్తశుద్ధి కనబరచిన వారికి ఎనలేని ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన అతిపెద్ద పేదల దవాఖానగా ఖ్యాతిగాంచిన గాంధీ దవాఖానలో పనిచేసిన సమయం తమ జీవితంలో ఎల్లకాలం గుర్తుండిపోతుందని అన్నారు. బదిలీపై వెళుతున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. సోమవారం సాయంత్రం బదిలీ ఆర్డర్‌లను అందుకున్న డాక్టర్ రాజారావు భువనగిరి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా, డాక్టర్ రమేశ్‌రెడ్డి యాదాద్రి భువనగిరి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మంగళవారం విధుల్లో చేరనున్నారు. గాంధీ దవాఖాన నూతన సూపరింటెండెంట్‌గా నల్గొండ జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నిజామాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర మంగళవారం భాధ్యతలు చేపట్టనున్నారు.

గిరిజన తెగ భాషకు ప్రాచీన మూలాలు

సీసీఎంబీ అధ్యయనంలో వెల్లడి

సిటీబ్యూరో, జులై 22(నమస్తే తెలంగాణ) : తూర్పు, మధ్య భారతంలో కనిపించే కొన్ని గిరిజన తెగలు మాట్లాడే భాషకు ప్రాచీన మూలాలు ఉన్నట్లుగా సీసీఎంబీ అధ్యయనంలో తేలింది. కొన్ని గిరిజన తెగల వ్యక్తుల భాషకు 4వేల ఏళ్ల చరిత్ర ఉందని, ఆస్ట్రో-ఆసియాటిక్ తెగల జన్యువులు, భాష నైపుణ్యాలను విశ్లేషించిన తర్వాత పరిశోధకులు వెల్లడించారు. సీసీఎంబీకి చెందిన సైంటిస్ట్ తంగరాజన్, లక్నోలోని బీర్బల్ సాహానీ ఇనిస్టిట్యూట్‌కు చెందిన నీరజ్ రాయ్‌తో పాటు పలు సంస్థల పరిశోధకులు తూర్పు భారతంలోని అతి పురాతన కాలం నాటి తెగల జన్యు వైవిధ్యాలను అన్వేషించారు. అరుదైన గిరిజన తెగలుగా గుర్తింపు పొందిన వారి జనాభా అత్యల్పంగానే ఉండగా.. దేశంలో ఈ తరహా పరిశోధన ఇప్పటివరకు జరగలేదు. ఒడిశాలోని బతూడీ, భూమ్జి, హో, మహాలీ వంటి ప్రధాన తెగలకు ఇండో యూరోపియన్ తెగలతో పోలి ఉన్నట్టుగా గుర్తించారు. పారిశ్రామికీకరణ, పెరుగుతున్న ఆధునీక జీవనశైలి కారణంగా ఈ భాష మూలాలను ఆయా తెగలు కోల్పోతున్నాయని, దీంతో తెగల జాతులకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. క్రమంగా ఆస్ట్రో ఆసియాటిక్ తెగలు ఇండో యూరోపియన్ తెగల భాషకు అలవాటు పడిపోతున్నారని, గుర్తించారు. ఆస్ట్రో ఆసియాటిక్ భాషను మాట్లాడేవారి తెగలను పరిరక్షించుకునేందుకు లోతైన పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని సీసీఎంబీ డైరెక్టర్ డా. వినయ్ కుమార్ నందికూరి అన్నారు. ఈ పరిశోధనలో ఘజియాబాద్‌కు చెందిన అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్, రాయ్‌పూర్‌కు చెందిన శ్రేయాన్ని హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్, చండీఘర్‌కు చెందిన చండీఘర్, పంజాబ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చెక్కులు అందుకున్న ట్రాన్స్‌జెండర్లు

మేడ్చల్ కలెక్టరేట్, జులై 22 : ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక పునరావాస పథకం కింద అందజేసిన మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ పొట్రు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యాలయంలో ట్రాన్స్ జెండర్స్‌కు ఆర్థిక సాయం, చిన్నారుల సంరక్షణ కేంద్రాల్లో అనాథలుగా వదిలివేసిన చిన్నారులకు కులం, జనన ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్‌కు అందజేసిన ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని, ఉపాధి పొందాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ ఆర్థిక పునరావాస పథకం కింద 21 మందిని ఎంపిక చేయగా 10 మందికి మాత్రమే రూ.50వేల చొప్పున రూ.5లక్షల ఆర్థిక సాయం మంజూరైందన్నారు. ప్రత్యేక చొరవ తీసుకొని మిగతా 11 మందికి కూడా ఆర్థిక సాయం అందజేసేందుకు మరో రూ.5.50 లక్షలు అదనంగా మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 26 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు రాధికా గుప్త, విజయేందర్ రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, లా అధికారి చంద్రావతి, అధికారులు నాగమణి, ఇంతియాజ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేణుశ్రీకి మెరుగైన వైద్యం కల్పించాలి

ఎల్బీనగర్, జూలై 22: శ్రీ చైతన్య కాలేజీ ఆర్కేపురం బ్రాంచ్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రేణుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనాయక్ కోరారు. రేణుశ్రీకి తక్కువ మార్కులు వస్తున్నాయంటూ కాలేజీ యాజమాన్యం ఒత్తిడి తేవడంతోనే ఆత్మహత్యకు యత్నించిందని కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, గిరిజన మహా శక్తి రాష్ట్ర అధ్యక్షుడు చందర్ నాయక్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సేవాలాల్ బంజారా సంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు

'దాశరథి' రచనలు ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయి

రవీంద్రభారతి,జూలై22: దాశరథి కృష్ణమాచార్యుల సాహిత్యం,ఆయన రాసిన గీతాలు తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయని రాష్ట్ర ఎక్సైజ్,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం డా.దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు, సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి దాశరథి కృష్ణమాచార్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్య కోట్లాది మంది తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గొప్ప మహనీయుడన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కవులు,కళాకారులతోనే సాధ్యమైందన్నారు. దాశరథి రచనలు తెలుగు సాహిత్యంపై చెరగని ముద్రవేశాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే సత్యనారాయణ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి,దాశరథి కుమారుడు లక్ష్మణ్, కూతురు ఇందిర పాల్గొన్నారు.

జూకంటి జగన్నాథంకు సాహిత్య పురస్కారాన్ని బహూకరిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

హిమాయత్‌నగర్,జూలై 22: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నారాయణగూడ చౌరస్తాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు సుమారు రూ.8,214.57 కోట్లు బకాయి ఉన్నాయని ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిన విడుదల చేయక పోవడం సిగ్గు చేటని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ నాయకులు తీగల శ్యామ్, మహేశ్, సతీశ్, చింటూ, మురళీ, శ్రీరాము పాల్గొన్నారు.